క్లుప్తంగా...

కళ్ల కలకతో జాగ్రత్త


డాక్టర్ అల్తాఫ్అక్బర్

గోల్కొండ: వేగంగా విస్తరించే వ్యాధుల్లో కళ్ల కలక ఒకటిని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అల్తాఫ్అక్బర్ అన్నారు. గురువారం ఆయన మెహిదీపట్నంలోని అక్బర్ ఐ ఆస్పత్రిలో కన్‌జెక్టివిటీస్(కళ్ల కలక)పై పలు విషయాలు వివరించారు. ఈ వ్యాధి సాధారణ వ్యాధి అని ఈ వ్యాధి సోకిన వారి కంటికి ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. కళ్లు ఉబ్బడం, కనుగుడ్లు ఎర్రగా లేత గులాబి రంగులో మారడం కళ్ల కలక ప్రాథమిక లక్షణాలన్నారు. కన్‌జెక్టివిటీస్ సోకిన వారితో చేతులు కలపడం, వారి వస్తువులు వాడడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

నియామకం


నర్సింహస్వామి

చాంద్రాయణగుట్ట: మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేసేందుకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జిగా నర్సింహస్వామి మాదిగను మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులో విశ్వరూప మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ బాధ్యత అప్పగించినందుకు మందకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు.

'హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం'



అబిడ్స్: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమయ్యిందని లేదని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్ పేర్కొన్నారు. నాంపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పాండుయాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో 10 వేల మంది నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు శ్రీనివాస్ యాదవ్, కృష్ణ, నట్రాజ్ నామ్‌దారి, కార్పొరేటర్లు సురేఖ ఓంప్రకాష్, శశికళ కృష్ణ పాల్గొన్నారు.

ఉస్మాన్‌గంజ్ నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



అఫ్జల్‌గంజ్: ఉస్మాన్‌గంజ్ నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ అధికారులకు సూచించారు. గురువారం అధికారులు, నాయకులతో కలిసి నాలా పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గంజ్‌లో వ్యాపారులతో సమన్వయం చేసుకుంటూ వారికి ఇబ్బందులు కలగకుండా నాలా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గంజ్ అసోసియేషన్ ప్రతినిధులు కట్ట మల్లేషం, పరమేశ్వర్ యాదవ్, శశి తదితరులు పాల్గొన్నారు.

అమరేంద్రకు పీవీ రమణ స్మారక పురస్కారం



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ కళా మందిరంలో పీవీ రమణ రంగస్థల స్మారక పురస్కారాన్ని 2023–24వ సంవత్సరానికి గాను ప్రముఖ రంగస్థల దర్శకుడు అమరేంద్రకు అందజేశారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు చేతుల మీదుగా అమరేంద్ర పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కోట్ల హనుమంతరావు, డాక్టర్ పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో 'బస్తీబాట'

గోల్కొండ: తాము నిర్వహిస్తున్న బస్తీబాటలో ప్రజా సమస్యలు ఎన్నో పరిష్కారం అవుతున్నాయని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ డివిజన్‌లో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ స్థానికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం, అనిల్, మైపాల్ సాగర్, వెంకటస్వామి, బాలరాజు, మూర్తి తదితరులున్నారు.

మల్టీ లెవల్ పార్కింగ్‌లకు గ్రీన్ సిగ్నల్

- చార్మినార్, మోతీగల్లీలలో నిర్మించనున్న మల్టీ లెవల్ పార్కింగ్
- సమస్యను ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించిన అక్బరుద్దీన్ ఒవైసీ
- స్పందించిన మంత్రి కేటీఆర్


చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ ఖాళీ స్థలంలో కొనసాగుతున్న తాత్కాలిక పార్కింగ్

చార్మినార్: ఎట్టకేలకు చార్మినార్‌లో జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్‌తో పాటు ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కింద ఆర్టీసీ బస్టాండ్..పైన జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణం పనులు చేపట్టడానికి ప్రభుత్వం ముందుకురావడంతో పాతబస్తీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి కొనసాగిన ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించడానికి మంత్రి కేటీఆర్ ఇటీవల జరిగిన శాసన సభలో తెలియజేయడంతో పాతబస్తీ ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు విఫలం..

- చార్మినార్‌లో ఐదేళ్లుగా శాశ్వత పరిష్కారంగా ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మల్టీ లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.
- జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ సిస్టంను అందుబాటులోకి తెస్తామంటూ తొలగించిన చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయనే విషయాన్ని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.
- స్పందించిన మంత్రి కేటీఆర్ చార్మినార్‌తో పాటు మోతీగల్లీలోని ఓల్డ్ పింఛన్ పేమెంట్ కార్యాలయం ఖాళీ స్థలంలో కూడా రూ.47.95 కోట్ల నిధులతో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మించనున్నట్లు వెల్లడించారు.

2018లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఆర్టీసీ బస్టాండ్ తొలగింపు..

- జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామంటూ ఇక్కడి ఆర్టీసి బస్టాండ్ పాత భవన సముదాయాన్ని 2018 జనవరి 24న కూల్చివేశారు.
- అటు పార్కింగ్ నిర్మాణం జరుగక..ఇటు బస్టాండ్ లేకపోవడంతో పాతబస్తీ ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణ గుట్ట తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రయాణికులకు చార్మినార్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఎంతో సౌకర్యంగా ఉండేది.

ఐదేళ్లు గడిచినా..

- చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ తొలగించి ఐదేళ్లు గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు.
- జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ కోసం అంటూ కూల్చివేతలు చేపట్టిన సంబంధిత అధికారులు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట లేదు.
- ప్రస్తుతం ఇక్కడ అన్ని రకాల వాహనాలతో తాత్కాలిక పార్కింగ్ కొనసాగుతోంది.
- చార్మినార్ ప్రధాన రోడ్డుపైనే ఒక వైపు బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేసి 'చల్తీ కా నామ్ గాడీ'అన్నట్లు బస్సులను నడుపుతున్నారు.
- ఆర్టీసీ బస్సులు తిరగడానికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు మధ్యలోనే బస్సులను తిప్పుతున్నారు డ్రై వర్లు.
- అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఇక్కడి భవనాన్ని కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు తదుపరి కార్యాచరణను విస్మరించారు.
- ఐదేళ్లుగా తమ బాధలను ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక వ్యవస్థలో సామాజిక అభివృద్ధి అవసరం


ప్రొ. కాంబ్లేను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ భీమా తదితరులు

గన్‌ఫౌండ్రీ: వ్యవసాయ రంగం ఆధిపత్యం తగ్గి సేవారంగ వాటా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో పెరిగిపోతుందని శివాజీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పీఎస్.కాంబ్లే అన్నారు. గురువారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో కళాశాల ఆర్థికశాస్త్ర శాఖ విభాగం ఆధ్వర్యంలో 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశం-విధానాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంతంగా వృద్ధి చెందుతూ మార్పులు జరుగుతున్నప్పటికీ సామాజిక అభివృద్ధి జరగడం లేదన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. భీమా, ఓయూ పరీక్షల నియంత్ర విభాగం అధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

సుల్తాన్‌బజార్: సెక్రటరియేట్‌లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సచివాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించి గతంలో నోటిఫికేషన్ ఇచ్చి 42 మందిని ఎంపిక చేసిన ప్రభుత్వం వారికి నియామక ఉత్తర్వులు మాత్రం ఇవ్వకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో బ్యాక్‌లాగ్ పోస్టులపై సమీక్ష నిర్వహించిన సీఎం వెంటనే భర్తీ చేయాలని ఆదేశించినా అధికారులు మాత్రం చర్యలు చేపట్టడం లేదన్నారు. కార్యక్రమంలో సాయికుమార్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఓటరు నమోదు


ఆల్ పార్టీ సమావేశంలో జీహెచ్‌ఎంసీ-14 అబిడ్స్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య

అబిడ్స్: ఓటర్ల నమోదు కార్యక్రమం జోరుగా చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ-14వ అబిడ్స్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ డి.బాలయ్య పేర్కొన్నారు. ఓటర్ల నమోదు, ఓటరు లిస్టులలో తప్పొప్పులు, అడ్రస్సుల మార్పులపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు. గురువారం అబిడ్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గంలో ఆల్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ..అన్ని రాజకీయ పార్టీలు కూడా కొత్త ఓటర్ల నమోదుకై పూర్తిగా సహకరించాలన్నారు. ఈ నెల 26, 27వ తేదీల్లో గోషామహల్ నియోజకవర్గంలోని 235 పోలీంగ్ బూత్‌లలో జీహెచ్‌ఎంసీ బీఎల్‌ఓలు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఆ రెండు రోజుల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ లాల్‌సింగ్, డాక్టర్ బీశ్వ సురేఖ, గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణ, కాంగ్రెస్ ఎ బ్లాక్ అధ్యక్షులు సీకే మూర్తి, ఏఎంసీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తికి 20 రోజుల జైలు

సంతోష్‌నగర్: అసభ్యకరంగా తిట్టడంతో మహిళపై దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు 20 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ ఖదీర్ (48) ఈనెల 12న తన భార్యను అసభ్యపదజాలంతో తిట్టడంతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు ఖదీర్‌ను అరెస్ట్ చేసి ఈ-పెట్టీ కేసు నమోదు చేశారు. అనంతరం మహ్మద్ ఖదీర్‌ను గురువారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు ఖదీర్‌కు 20 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ఆత్మస్థైర్యంతో అడుగు వేస్తే విజయం సాధ్యం


మాట్లాడుతున్న బుర్రా వెంకటేశ్

చార్మినార్: ఆత్మస్థైర్యంతో ముందుకు అడుగు వేసేవారి కోసం ఎన్నో అవకాశాలు ఎదురు చూస్తుంటాయని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సిటీ కళాశాలలో ఏర్పాటైన సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ కోర్సు ప్రారంభ సభలో వెంకటేశం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ బలాలను, బలహీనతలను, అవకాశాలను, అడ్డంకులను విశ్లేషించుకొని తగిన ప్రణాళికను రచిస్తే విజయం సాధించగలరని సూచించారు. సమావేశానికి అధ్యక్షతన వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ద్వారా 300 మందికి పైగా అభ్యర్థులకు గ్రూపు పరీక్షల కోచింగ్ ఇచ్చామని.. ఇప్పుడు తమ కళాశాల విద్యార్థుల కోసం సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ కోర్సు, బీసీ స్టడీ ఉచితంగా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పద్మ అనురాధ సమన్వయం చేసిన ఈ సమావేశంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, కోర్సు కో ఆర్డినేటర్ బాలకృష్ణ, డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ జె.నీరజా, డాక్టర్ యాదయ్య, శాంతి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం

అఫ్జల్‌గంజ్: మూసీనదిలో గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యమైన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సంతోషం తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీ బ్రిడ్జి ప్రాంతంలో మూసీ నదిలో గుర్తుతెలియని యువతి మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకు రావడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు యువతి మృతదేహాన్ని బయటకు తీశారు. ఆమె ఎవరు అక్కడి నుంచి వచ్చింది అనే విషయాలు తెలియాల్సి ఉందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


బేగంబజార్‌లో పర్యటిస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ గుప్తా, ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్

అబిడ్స్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్ డీసీపీ డి.శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. గోషామహల్, బేగంబజార్, ఎంజే బ్రిడ్జి, జుమ్మెరాత్ బజార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్‌తో కలిసి పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై అక్రమంగా సామగ్రిని పెట్టినవారిని తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలను క్రమం తప్పకుండా పాటించాలన్నారు. తరచూ అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పిస్తామన్నారు.

కత్తితో సంచరించిన వ్యక్తికి 11 రోజుల జైలు

అబిడ్స్: తాగిన మత్తులో కత్తి పట్టుకొని తిరుగుతున్న వ్యక్తిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుఫామందిర్ ప్రాంతానికి చెందిన మల్లేష్ యాదవ్(35) కేటరింగ్ పనిచేస్తుంటాడు. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో మద్యం తాగి కత్తితో ఆ ప్రాంతంలో స్వైరవిహారం చేస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో అక్కడకి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి గురువారం ఉదయం నాంపల్లిలోని రెండవ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా 11 రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. అనంతరం నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

'జాగృతి' తరహాలో సమాజ సేవ చేయాలి


వాసు ముదిరాజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

అబిడ్స్: జాగృతి వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ తరహాలో ఇతర సంస్థలు సామాజిక సేవలు చేయాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా గోషామహల్‌తో పాటు నగరం నలుమూలలా జాగృతి సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అమోఘమన్నారు. 20 ఏళ్లుగా జాగృతి సంస్థ నిరంతరం పేద బడుగు వర్గాలకు, పేద విద్యార్థులకు అండగా ఉండడంతో పాటు ఆధ్యాత్మిక భావాలను కూడా పెంపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షుడు వాసు ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్, కార్వాన్ డివిజన్‌లకు చెందిన మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ఎటువంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో సుమారు రూ.292 కోట్లతో ఆధునీక డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. మరో వైపు తాను కమ్యూనిటీహాళ్ల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీహాళ్ల ఆధునీకరణల విషయమై ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, గోల్కొండ, టోలిచౌకి డివిజన్‌ల కార్పొరేటర్ల ప్రతినిధులు బద్రుద్దీన్, హారూన్‌ఫరాన్, నాయకులు మహ్మద్ యూనుస్, రఫత్‌హుస్సేన్, జబ్బార్ తదితరులున్నారు.

ప్రజా సంక్షేమానికి బీఆర్‌ఎస్ పెద్దపీట


మంత్రి తలసానితో వివిధ కాలనీల ప్రతినిధులు

గోల్కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కార్వాన్ కాలనీల సంఘాల ప్రతినిధులు గురువారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు కాలనీలలో ఉన్న సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్న తీరు అందరి మనన్నలు పొందుతుందన్నారు. మరోవైపు బీసీలు, మైనార్టీల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ చేపడుతున్న పథకాలు, కేటాయిస్తున్న నిధులు మరే రాష్ట్రంలో కూడా ఇది జరగడం లేదని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, కరుణాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

ఇంటింటికీ బీజేపీ

గోల్కొండ: ప్రజా స్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు ఓటరు నమోదు ఆవశకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌సాగర్, నామా యాదగిరినేత తదితరులున్నారు.


ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నాంపల్లి: నియోజకవర్గం పరిధిలోని మాసబ్‌ట్యాంక్‌లో అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-12 టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి నేతృత్వంలో ఈ కూల్చివేతలు జరిగాయి. స్థానికంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసుల సహకారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శేఖర్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్ రావు, మోహన్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి


బండ్లగూడ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నేతలు

చాంద్రాయణగుట్ట: డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్లు, దళిత, బీసీ బంధులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని బీజేపీ చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా అసెంబ్లీల కన్వీనర్లు గ్యార ప్రభాకర్, ధీరజ్‌లాల్, ప్రశాంత్ డిమాండ్ చేశారు. బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం నిరసనకు దిగారు. అనంతరం తహసీల్దార్ జయమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. కొడీ మహేందర్, రూప్‌రాజ్, మాదరి చంద్రశేఖర్, డాక్టర్ వై.రాజ్‌కుమార్, మధుకర్ రెడ్డి, విజయ్‌కుమార్, పండరీనాథ్, సుభాష్, వెంకటేష్, సుమన్ ముదిరాజ్, ఉదయ్ కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత నగరంగా మార్చేందుకు కృషి చేయాలి



ర్యాలీలో ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై సుమలత

గౌలిపురా: డ్రగ్స్ రహిత నగరంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఛత్రినాక ఏసీపీ రమేశ్ తెలిపారు. మొఘల్‌పురా పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గౌలిపురా, గాంధీబొమ్మ, ఛత్రినాక చౌరస్తా, లాల్‌దర్వాజా మోడ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, వైట్నర్‌లు వంటివి ఎవరైనా విక్రయించినట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యా నాయక్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మొఘల్‌పురా ఎస్సై సుమలత తదితరులు పాల్గొన్నారు.

'గ్లోమస్ ట్యూమర్'కు ఈఎన్‌టీలో అరుదైన శస్త్ర చికిత్స

సుల్తాన్‌బజార్: చెవి సమస్యతో తీవ్రంగా బాధపడుతున్న ఓ వ్యక్తికి ఈఎన్‌టీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి అతడి ప్రాణాలు కాపాడారు. వివలరాలి ఉన్నాయి.. అదిలాబాద్‌లోని లక్సెట్టిపేట మండలం వెంట్రావుపేటకు చెందిన విద్యాసాగర్ (52) మూడేళ్లుగా చెవి సమస్యతో బాధపడుతన్నాడు. చెవి నుంచి నిరంతరం చీము కారుతుండడంతో ఎంతోమంది వైద్యులను సంప్రదించాడు. గతంలో కరీంనగర్‌లో రెండుసార్లు ఆపరేషన్ సైతం జరిగినా ఎలాంటి మార్పు రాలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకు మూతి వంకరపోయి అన్నం తినడం కష్టంగా మారింది. అంతేకాక ఓ కనురెప్ప సైతం మూసుకోవడం లేదు. హైదరాబాద్‌కు వచ్చి ప్రైవేటు ఆస్పత్రిలో చూపిస్తే ఆపరేషన్‌కు లక్షల్లో ఖర్చు అవుతుందని ప్రైవేటు వైద్యులు తెలిపారు. అంత ఖర్చు భరించలేని విద్యాసాగర్ చివరకు కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రికి రాగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి 'టింపానో జుగులార్ పారా గాంగ్లియోమో, గ్రేడ్-4 ఫేషియల్ పెరాలిసిస్'గా గుర్తించారు. చెవిలో ఉండే రక్త నాళాల నుంచి పుట్టిన ఒక గడ్డలాంటిదని ఈఎన్‌టీ వైద్యులు తెలిపారు. ఇది చెవి లోపలంతా వ్యాపించి చెవిలో ఉన్న ముఖ్యమైన భాగాలన్నింటిని తినేసిందన్నారు. ఇంకొన్ని రోజులు అలాగే ఉంటే మెదడుకు వ్యాపించి ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉండేదన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని వైద్యబృందం దాదాపుగా 4గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేసి ఈ ట్యూమర్‌ను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సత్యకిరణ్, ఆశీష్, మీనా, శ్వేత, సదానందం, నిఖిలతో పాటు వైద్య సిబ్బంది ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అభినందించారు.

కేటీఆర్‌ను కలిసిన ఆశీష్‌కుమార్‌యాదవ్



అబిడ్స్: మంత్రి కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ కలిశారు. గురువారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న థ్రిల్‌సిటీలో జరిగిన కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ కలిసి స్వాగతం పలికారు.